క్లుప్తంగా

పరిశీలించి.. పాఠాలు విని



తరగతి గదిలో ఉపాధ్యాయురాలి బోధన తీరును పరిశీలిస్తున్న ఎంఈఓ ఉపేందర్‌రావు

నడిగూడెం : మండలంలోని రత్నవరంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం మండల విద్యాధికారి బి.ఉపేందర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల విద్యా బోధన తీరును తరగతి గదిలో కూర్చొని పరిశీలించారు. అలాగే విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమయ పాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సీఆర్‌పీ నందిగామ రామారావు, ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆలయానికి వెండి పంచ హారతి బహూకరణ



వెండి పంచహారతి అందజేస్తున్న దివ్యశ్రీ

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయానికి బుధవారం నడిగూడెంకు చెందిన బుస్సా మహేష్, సులోచనల కుమార్తె దివ్యశ్రీ వెండి పంచ హారతి బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రాజశేఖర్‌శర్మ, సాయి సంతోష్, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ఉచిత చేపపిల్లలు



మొద్దులచెరువులో చేపపిల్లలు వదులుతున్న మత్స్యశాఖ ఫీల్డ్ అసిస్టెంట్ సుమలత

మునగాల : మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుందని మత్స్యశాఖ ఫీల్డ్ అసిస్టెంట్ సుమలత తెలిపారు. బుధవారం మండలంలోని తాడువాయి శివారులో గల మొద్దులచెరువులో ప్రభుత్వం నుంచి మంజూరైన చేపపిల్లలను ఆమె వదిలారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోల ఉపేందర్‌రావు, మత్స్య సొసైటీ సభ్యులు బిట్టు లింగయ్య, ముంజల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీను, పాపయ్య, మొలుగూరి సైదులు, ముంజల వీరయ్య, బిట్టు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


చౌటపల్లిలో పశు వైద్యశిబిరం

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులలో గర్భకోశ వ్యాధికి చికిత్స చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ సురేంద్ర, డాక్టర్ రమేష్, గోపాలమిత్రలు ఉపేందర్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా 33/11 కేవీ విద్యుత్ లైన్ పరిధిలోని నేరేడుచర్ల పట్టణంలో పలు ప్రాంతాల్లో, పాలకవీడు, నేరేడుచర్ల మండలంలోని గ్రామాల్లో గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా గరిడేపల్లి పరిధిలోని 33/11 కేవీ గానుగబండ సబ్ స్టేషన్, 33/11 కేవీ కల్మలచెరువు సబ్ స్టేషన్ పరిధిలో గల అన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



నగర సంకీర్తన నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల అయ్యప్పస్వామి ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆలయ తాంత్రి పూజారి పల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో నగర సంకీర్తన, విగ్నేశ్వరుని హోమం, అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలధారులకు భిక్ష, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గడ్డిపల్లి, ఎర్రకుంట, రాఘవాపురం గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

తారస్థాయికి ఆధిపత్య పోరు !

- రామాపురం మహాకూటమిలో చీలిక
- రెండు వర్గాలుగా పలువురు టీడీపీ, కాంగ్రెస్ నాయకులు
- అన్నిచోట్లా తమదే నెగ్గాలని ఇరువర్గాల పంతం
- గ్రామంలో రాత్రికిరాత్రే ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు
- ఇటీవల ఎన్‌టీఆర్ విగ్రహం ధ్వంసం
- చర్చనీయాంశంగా వ్యవహారం



వైఎస్సార్ విగ్రహం ఎదురుగా ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి విగ్రహం



ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులు

చిలుకూరు : మండలంలోని రామాపురం గ్రామంలో మహా కూటమిలో ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది. మహాకూటమిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ, టీడీపీ నాయకుల్లో కొందరు వర్గాలుగా ఏర్పడ్డారు. దీంతో గ్రామంలో పంచాయతీలు, పలు విషయాల్లో తమదే నెగ్గాలని ఇరువర్గాలు పంతం పడుతున్నారు. ఇటీవల గ్రామంలో ఎన్‌టీఆర్ విగ్రహం ధ్వంసం, రాత్రికిరాత్రే ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు వంటి వరుస ఘటనలకు ఈ వర్గ విభేదాలే కారణమై ఉండవచ్చని స్థానికులు అంటున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి..

గ్రామంలో గత కొన్నేళ్లుగా బీఆర్‌ఎస్ పార్టీకి పోటీగా టీడీపీ, కాంగ్రెస్ నాయకులు మహాకూటమిగా ఏర్పడ్డారు. ఉమ్మడి అభ్యర్థులను బరిలో ఉంచి గత ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకున్నారు. అయితే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నంత కాలం వీరి మధ్య సఖ్యత బాగానే ఉంది. ఇక కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి మహాకూటమి నాయకుల మధ్య వర్గ పోరు మొదలైంది. రెండు పార్టీల్లోనూ రెండు వర్గాలుగా చీలిపోయాయి. దీంతో మహాకూటమి నాయకుల మధ్య తీవ్ర స్థాయిలో బేధాభిప్రాయాలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీత వెంకటేశ్వర్లుతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులది ఇదే గ్రామం కావడం, అదే విధంగా టీడీపీ నుంచి బలమైన నాయకులైన తాజా మాజీ వైస్ ఎంపీపీ జనపనేని జనకీకృష్ణారావుతో పాటు టీడీపీ రాష్ట్ర నాయకుడు వేమూరి సురేష్, మరికొందరు నాయకులు ఈ గ్రామస్తులే కావడంతో వారి మధ్య ఆధిపత్య పోరు నెలకొంది. గ్రామంలో ప్రతి చిన్న అభివృద్ధి పనికి, చిన్నచిన్న కుటుంబ, భూ తగాదాలు, పంచాయితీలు అటు ఇటు తిరిగి చివరకు కాంగ్రెస్, టీడీపీ నాయకుల వద్దకు వస్తుండడంతో పరిష్కారం విషయంలో తమ మాటే నెగ్గాలని ఇరు వర్గాలు ప్రయత్నిస్తుండడంతో ఆధిపత్య పోరు నెలకొంది. ఇరు పార్టీల వారికి ఎమ్మెల్యే సపోర్టు ఉండడంతో ఇరువర్గాల వారు ఏ మాత్రం తగ్గడం లేదని తెలుస్తోంది.

రాత్రికిరాత్రే విగ్రహం ఏర్పాటు..

రామాపురంలో నాయకుల మధ్య వర్గపోరు నేపథ్యంలో గత వారం రోజులుగా పలు ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గ్రామంలో ఐదు రోజుల క్రితం మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఆ ఘటన మరువక ముందే బుధవారం తెల్లవారుజామున మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం ముందు పలువురు రాత్రికిరాత్రే భారీ అంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఘటనలకు ముందు గతంలో వైఎస్సార్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇవన్నీ నాయకుల మధ్య అధిపత్యం పోరుతోనే జరుగుతున్నట్లు చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా వైఎస్సార్ విగ్రహం ప్రాంగణంలో ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేయడంతో వైఎస్సార్ విగ్రహం కనబడడం లేదని పలువురు కాంగ్రెస్ నాయకులు చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయంపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

త్వరలోనే పీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభిస్తాం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం



మునగాలలో పాత సివిల్ ఆసుపత్రి కూల్చివేత పనులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

మునగాల : మండల కేంద్రంలో రూ.1.55కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవనాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్టు జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ కోటాచలం తెలిపారు. బుధవారం ఆయన మునగాల పీహెచ్‌సీ ఆవరణలో ఉన్న పాత సివిల్ ఆసుపత్రి భవనం కూల్చివేత పనులను పరిశీలించి మాట్లాడారు. నూతన భవన నిర్మాణ పనులు పూర్తయి ప్రాంభానికి సిద్ధంగా ఉన్నప్పటికీ పాత భవనం అడ్డుగా ఉన్నందున దాన్ని కూల్చివేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట పీహెచ్‌సీ మండల వైద్యాధికారి డాక్టర్ పి.రవీందర్ ఉన్నారు.

సైబర్ మోసాల బారిన పడొద్దు : సీఐ



పోలీస్ కళాజాతాలో మాట్లాడుతున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్ : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సైబర్ మోసాల బారిన పడొద్దని సీఐ చరమందరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని చైతన్య హైస్కూల్‌లో సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్ నివారణపై పోలీస్ కళాబృందం నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడారు. గంజాయి, మత్తు పదార్థాలు సేవించిన, విక్రయించినట్లు తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విద్యార్థులు, యువత ఇంటర్నెట్‌ను అవసరం మేరకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దన్నారు. సైబర్ మోసాలపై 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. వేధింపులపై 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ముత్తయ్య, ఏఎస్‌ఐ రమేష్, హెచ్‌ఎం ప్రతాపరెడ్డి, కానిస్టేబుళ్లు నాగరాజు, నరేష్, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య గురులింగం, ఈశ్వరచారి, కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు పండుగను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బచ్చు అశోక్

మునగాల : మహబూబ్‌నగర్‌లో ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించబోయే రైతు పండుగకు జిల్లా నుంచి రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బచ్చు అశోక్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక నిధులు కేటాయిస్తుందని తెలిపారు. ఈ సదస్సులో వ్యవసాయ రంగంలో ఆధునిక మార్పులు, ఆదర్శ రైతుల ప్రసంగాలు ఉంటాయన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మాతంగి బసవయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శులు ఎలక నరేందర్‌రెడ్డి, కోటేశ్వరరావు, మండల అధికార ప్రతినిధి వీరబాబు, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాసర్ల శ్రీనివాస్, నాయకులు శ్రీపాల్‌రెడ్డి, నరసింహారావు, నాగరాజు, గోపి, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగుల నిరసన



కేజీబీవీలో నిరసన తెలుపుతున్న టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు

గరిడేపల్లి : ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోవడంపై బుధవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయం ఉద్యోగులు మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బాలసైదిరెడ్డి మాట్లాడుతూ కనీస వేతన స్కేల్‌ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి శైలజ, నాగేశ్వరరావు, కిషోర్‌బాబు, జానిమియా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న కోదాడ జేఏసీ, ఉద్యమకారులు

కోదాడరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జేఏసీ కన్వీనర్ రాయపూడి చిన్ని, ఉద్యమకారుడు రాయపుడి వెంకటనారాయణ కోరారు. ఈమేరకు సూర్యాపేట నుంచి భద్రాచలం వరకు పాదయాత్ర చేస్తున్న ఉద్యమకారులకు బుధవారం కోదాడలో వారు స్వాగతం పలికి మాట్లాడారు. ఉద్యమ నేపథ్యాన్ని వివరిస్తూ స్థానిక ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పిస్తూ పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు. ఉద్యమకారులకు పింఛన్, 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మలిదశ ఉద్యమకారులు ఉదయగిరి, కన్నెగంటి నరసింహారావు, రమేష్, పాదయాత్ర నిర్వాహకులు అంజిరెడ్డి, అమృతనాయక్, గోపి, సోమయ్య, గంగయ్య, వెంకన్న, రహమాన్‌అలీ ఉన్నారు.

1న మాలల 'సింహగర్జన' సభ



హుజూర్‌నగర్ : మాలల సింహగర్జన పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లో డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ దగ్గుపాటి బాబురావు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని గోవిందపురంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాలల సింహగర్జన పోస్టర్, స్టిక్కర్లను ఆవిష్కరించి మాట్లాడారు. మాల జాతి ఆత్మగౌరవం, ఉనికి కోసం సత్తా చాటాల్సిన సమయం వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బెంజిమెన్, రాములు, శ్రీను, పున్నయ్య, వెంకటేశ్వర్లు, నరసింహారావు, వినోద్, రాజు, రాములు, రామకృష్ణ, స్వామి, అంబేద్కర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సింహగర్జనను విజయవంతం చేయాలి

నడిగూడెం : హైదరాబాద్‌లోని జింఖానా ప్రాంగణంలో డిసెంబర్ 1న నిర్వహించనున్న మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర నాయకుడు కామళ్ల ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం మండలంలోని రామాపురంలో ఆయన వాల్ పోస్టర్, కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుజ్జ అంజి, యలక హుస్సేన్, దావీదు, వెంకటేశ్వర్లు, చిరంజీవి, రమేష్, జయరాజు, సుధాకర్, శ్రీను, రవి, రత్తమ్మ, రమాదేవి, పాల్గొన్నారు.

ఊరూరా ప్రజాపాలన విజయోత్సవాలు



కళాజాతా ప్రదర్శనలో అధికారులు, కళాకారులు

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు వల్లాపురం, రామాపురం గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై ఆట పాటలతో కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్, ఎంపీఓ విజయలక్ష్మి, సాంస్కృతిక సారథి టీం లీడర్ ఈర్ల సాయి, గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, పాలకుర్తి శ్రీకాంత్, డప్పు శంకర్, పాక ఉపేందర్, మేడిపల్లి వేణు, గజ్జి మంజుల, సిరపంగి రాధ, మల్లెపాక శిరీష, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనభోజన మహోత్సవం



చిలుకూరు : యాదగిరిగుట్ట సీఐ కృష్ణను సన్మానిస్తున్న మున్నూరు కాపు కులపెద్దలు



గరిడేపల్లి : వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

గరిడేపల్లి : కార్తీక మాసం పురస్కరించుకొని గరిడేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మండల ఆర్యవైశ్య సంఘం, గ్రేటర్ వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పైడిమరి రంగనాథ్, పైడిమర్రి నరసింహారావు, వాసవీ, వనితా క్లబ్ అధ్యక్షుడు సతీష్‌కుమార్, వనిత క్లబ్ అధ్యక్షురాలు పొలిశెట్టి ధనలక్ష్మి, శ్రీరంగం ప్రసాద్, గుంటూరు రాము, ముచ్చర్ల గోపాలకృష్ణ, తాటికొండ లక్ష్మయ్య, వీరస్వామి, సురేష్, శ్రీనివాస్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరులో మున్నూరుకాపు వన భోజనాలు

చిలుకూరు : మండల కేంద్రంలో బుధవారం మున్నూరు కాపు కులస్తులు కార్తీక వన భోజన మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులోని తోటకు తరలివెళ్లి మహిళలు అక్కడ ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు కుటుంబసభ్యులు, ఉద్యోగులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



మునగాల : బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకటరెడ్డి, తదితరులు



గరిడేపల్లి : పొనుగోడులో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

మునగాల : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈనెల 29 నిర్వహించబోయే సీపీఎం జిల్లా మహాసభ (బహిరంగ సభ)ను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి కోరారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలో సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. శాఖా కార్యదర్శులు గడ్డం వినోద్, కిన్నెర వెంకన్న పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి

గరిడేపల్లి : సూర్యాపేటలో ఈ నెల 29, 30, డిసెంబర్ 1న నిర్వహించబోయే సీపీఎం జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ఎస్‌కే యాకూబ్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పొనుగోడు గ్రామంలో మహాసభల కరపత్రం ఆవిష్కరించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నందిపాటి మట్టయ్య, మండవ సైదులు, చామకూరి వెంకటనర్సయ్య, శ్రీనివాస్, జాన్ మహ్మద్, మిరాంబీ, భిక్షం, నాగరాజు, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోటు ప్రసాద్ మృతి పార్టీకి తీరని లోటు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు

గరిడేపల్లి : ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు పోటు ప్రసాద్ మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. ప్రసాద్ మృతి పట్ల బుధవారం మండల కేంద్రంలో సీపీఐ మండల సమితి, రాష్ట్రోపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు త్రిపురం సుధాకర్‌రెడ్డి, యడ్ల అంజిరెడ్డి, కడియాల అప్పయ్య, పోటు పూర్ణచందర్‌రావు, శ్రీను, వెంకన్న, వెంకట్‌రెడ్డి, కనకయ్య, సందీప్, స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కేవీ సత్యనారాయణ, నర్సింహారావు, నాగరాజు, బాలస్వామి పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారుల ఇరుముడి వేడుక



చిలుకూరు : ఇరుముడి ధరించి శబరికి వెళ్తున్న అయ్యప్ప మాలధారులు

చిలుకూరు : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో గల వీరాంజనేయస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్పస్వాముల ఇరుముడి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులు ఇరుముడి ధరించి శబరికి వెళ్లారు. అదేవిధంగా చిలుకూరు శివాలయంలో శివ మాలధారులు ఇరుముడి ధరించి శ్రీశైలం వెళ్లారు.

నల్లబండగూడెంలో..

కోదాడరూరల్ : మండలంలోని నల్లబండగూడెం గ్రామ శివారులోని లింగమంతుల గుట్టపై అయ్యప్ప మాలధారుల ఇరుముడి మహోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాలధారులకు ఇరుముడి కట్టారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు, బంధువుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

దాతల సహకారంతో అన్నదానం



మునగాల : అన్నదానంలో పాల్గొన్న దాతలు, మాలధారులు

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప ఆలయం ఆవరణలో గల అన్నప్రసాద వితరణ కేంద్రంలో బుధవారం 115 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసచారి గురుస్వామి తెలిపారు. అన్నదానానికి కొమ్ము కృష్ణయ్య జ్ఞాపకార్థం కుమారుడు కొమ్ము ఈదారావు -లక్ష్మి(మునగాల), పెన్‌పహాడ్ మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన నెమ్మాని రామమూర్తి, కాసాని ఎల్లయ్య (బరాఖత్‌గూడెం) సహకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు పిల్లుట్ల శ్రీనివాస్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలధారణతో ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, మాలధారులు ఉన్నారు.

ముమ్మరంగా సర్వే డేటా ఎంట్రీ



సర్వే డేటా ఎంట్రీ చేస్తున్న సిబ్బంది

చిలుకూరు : మండల కేంద్రంలోని మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయం, మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. మండల వ్యాప్తంగా 14,340 కుటుంబాల వివరాలు సేకరించగా వాటిల్లో బుధవారం నాటికి 4 వేల కుటుంబాలవి ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

డాక్టర్ రాజశేఖర్‌గౌడ్‌కు సన్మానం

హుజూర్‌నగర్ : ఖమ్మం జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ సర్వీసెస్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ బుధవారం హుజూర్‌నగర్ వచ్చిన సందర్భంగా కళాబంధు డాక్టర్ టి. సుబ్బరామిరెడ్డి, సేవా కళా సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ సుతారి శ్రీనివాసరావులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

నాగారం : ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వి.బ్రహ్మయ్య ఐకేపీ నిర్వాహకులను హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని పస్తాల, ఫణిగిరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలని సూచించారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పాటల పోటీల కరపత్రాల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న నిర్వాహకులు

సూర్యాపేట : పట్టణంలోని బాల భవన్ ప్రాంగణంలో శ్రీజ్ఞాన సరస్వతి సాంస్కృతిక కళావేదిక ఆధ్వర్యంలో అమర గాయకుడు పద్మశ్రీ ఘంటసాల 102వ జయంతిని పురస్కరించుకొని డిసెంబర్ 1న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్షుడు జూనియర్ ఘంటసాల బుర్రి వెంకటేశ్వర్లు, సామాజికవేత్త ప్రధాన కార్యదర్శి గుండా రమేష్ తెలిపారు. బుధవారం పట్టణంలో పాటల పోటీల కరపత్రాలను మనం వికాస వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్, వేదిక నిర్వాహకులు ఆవిష్కరించారు. విజేతలకు డిసెంబర్ 4న పురస్కారాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డీఈఓపై చర్య తీసుకోవాలి

అర్వపల్లి : విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తూ అసభ్యకరంగా మాట్లాడుతున్న డీఈఓ అశోక్‌పై రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ కోరారు. బుధవారం అర్వపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఈఓపై గతంలో జిల్లా ఉన్నతాధికారులకు అనేక ఫిర్యాదులు చేసినా స్పందించలేదని ఆయన అన్నారు. కలెక్టర్ వెంటనే చర్య తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని ఆయన అన్నారు.

వసతి గృహం తనిఖీ

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని బుధవారం రాత్రి జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, మండల ప్రత్యేక అధికారి రాజేశ్వర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిని పరిశీలించారు. స్టడీ అవర్‌లో ఉన్న విద్యార్థులతో మాట్లాడి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.

రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాల గ్రామంలో నక్క చంద్రశేఖర్‌కు చెందిన ఆవు బుధవారం ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. దీంతో కరివిరాల, వెంకట్రాంపురం, చెన్నకేశ్వాపురం గ్రామాల ప్రజలు దూడలను ఆసక్తిగా తిలకించారు.

గిరిబాబుకు నివాళి

హుజూర్‌నగర్ : బాచిమంచి గిరిబాబు ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకుడు గిరిబాబు మొదటి వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.